
ప్రజాశక్తి
శనివారం 22 ఫిబ్రవరి 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





సిఎం రాకపై ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు

ఈనెల 23 న ఆదివారం గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన పురస్కరించుకొని జిల్లా అధికారులతో కలిసి భద్రతపై ఏర్పాట్లపై ఎఎస్ఎల్ (అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్) జిల్లా అధికారులు సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఒ.ఆనంద్, ఎస్పి జి.కృష్ణకాంత్ ఇంటలిజెన్స్, సంబంధిత నాయకులు ఇతర అన్ని విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సిఎంకు పూర్తిస్థాయి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లపై అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. చివరగా ముఖ్యమంత్రి పర్యటన ప్రదేశాలను హెలిపాడ్ మొదలు, రూట్, విపిఆర్ కన్వెన్షన్ సెంటర్, పార్కింగ్ ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాలకు పార్కింగు స్థలాలను, అదేవిధంగా ట్రాఫిక్ కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేయాలని తగిన సూచనలు చేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్పి

రైతన్న కష్టానికి ఫలితం అందేనా..!

◆నేడు రైతుల భారీ ర్యాలీ
◆ఆర్‌బికె కేంద్రాలు మంత్రిచే పరిశీలన
◆మూడు వందల కేంద్రాలు తెరిచాం- జెసి

రైతన్న తన కష్టానికి ఫలితం ఆశిస్తున్నారు. ఆరుగాలం పండించిన పంటను దళారులు, మిల్లర్లు, మింగేస్తున్నారు. అందుకే రైతులు మద్దతు ధర కోసం ఉద్యమిస్తున్నారు. నేడు రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయం కార్మిక సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు.రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకుంటాం, మద్దతు ధర ప్రకటిస్తామని చెబుతోన్న మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. గతంలో జిల్లాలో పెద్ద ఎత్తున ఆర్‌బికె, సివిల్ సప్లయ్, ఎఫ్‌సిఐ కేంద్రాల ద్వార పెద్దఎత్తున ధాన్యం కొనుగోలు చేసేవారు. గత నాలుగు సంవత్సరాల నుండి ఇది పడకేసింది. ప్రభుత్వానికి రేషన్‌బియ్యం, హాస్టళ్లు ఇతర అవసరాలకు ఉపయోగపడే లేవీని ప్రభుత్వం స్వీకరించడం లేదు. గతేడాది జులై నుంచి కేంద్ర ప్రభుత్వం బియ్యం ఎగుమతులను నిలిపేసింది. నూతన ప్రభుత్వం వచ్చాక తొలి సారి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. జిల్లా వ్యాపితంగా మూడు వందల కేంద్రాలు ఏర్పాటు చేశామని జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. 48 గంటల్లో నగదు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని "ప్రజాశక్తి"కి తెలిపారు. నేడు మంత్రి నాదెండ్ల మనోహర్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించనున్నారు.





మాట్లాడుతున్న జెసి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

జిల్లా వ్యాపితంగా వరికోతలు ప్రారంభ మయ్యాయి. ఇప్పటికే మెట్ట ప్రాంత రైతులు ఉదయగిరి, సీతారాపురం, మర్రిపాడు, వరికుంటపాడు, వింజమూరు, దుత్తలూరు వంటి ప్రాంతాల్లో ఈ ఏడాది ఎర్ర జగిద్యాల (మసూర) రకం సాగు చేశారు. ప్రతేడాది మంచి ధర వస్తుండడంతో ఈ ఏడాది దానిని రైతులు పెద్ద ఎత్తున సాగుచేశారు. ఈ మండలాల్లో కనీసం 10 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇది కాకుండా జిల్లా వ్యాపితంగా ఎగ్రేడ్ రకం కెఎన్ఎం, సుగర్ లెస్, బిపిటి తోపాటు 1001 రకం సుమారు 7 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఈ -క్రాప్ లో మాత్రం 3 లక్షల ఎకరాలు మాత్రమే నమోదు చేసుకున్నారు. దీని ద్వార 11 లక్షల పుట్లు చేతికి వస్తాయని అధికారులు భావిస్తున్నారు. ఇందులో మూడు లక్షల పుట్లు ఆర్‌బికెల ద్వార కొనుగోలు చేయనున్నారు. జిల్లా వ్యాపితంగా 300 ఆర్‌బికెలు ప్రారంభించారు. ఇక్కడ తేమ కొలిచే మిషన్, డేటా ఎంట్రి ఆపరేటర్, వాహనాలకు జిపిఎస్ వంటి సదుపాయాలు సిద్ధం చేసుకున్నారు. ఇప్పటి వరకు రైతులు కేంద్రాల్లో విక్రయించలేదు. గతంలో కొనుగోలు చేసిన 48 గంటల్లోనే నగదు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఆలస్యమైంది. ఇప్పుడు అలా కాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. గోతాల కొరత, తీర్చడం, వంటివాటిపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. రైతులు పడ్డ కష్టానికి ఫలితం వస్తుందని ఆశపడుతున్నారు. ఎకరా సాగుచేయడానికి సుమారుగా రూ.26,500 ఖర్చు చేశారు. వరిసాగు రైతుకు రోజు రోజుకు భారంగా మారుతోంది. ప్రతిది భారీగా ధరలు పెరిగిపోతున్నాయి. పండించిన పంటకు మాత్రం మద్దతు ధర దక్కడం లేదు.. ఇందుకు ప్రధాన కారణం తెగుళ్లు,. గతంలో ఎకరానికి 4 పుట్లు వస్తుండగా, ఈ ఏడాది రూ.2.5 పుట్లు మాత్రమే దిగుబడి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. వాతావరణంలో వచ్చిన ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి స్థితి వచ్చిందని రైతులంటున్నారు. దీనికి తోడు సాగు కష్టంగా మారింది. కూలీలు రేట్లు, డీజిల్ ధరలు, పెరుగుదలతోపాటు, మద్దతు ధర లభించడం లేదు. ఎకరా పోలం దుక్కిదున్నడానికి రూ.7000, నాట్లు వేయడానికి రూ.7000, డిఎపి బస్తా రూ.1700, యూరియా రెండు బస్తాలు రూ.700, స్ప్రేర్ మందు రూ.1000, కలుపునకు రూ.2500, వరి కోతకు రూ.3500,ఖర్చు చేస్తున్నారు. ఎకరానికి రూ.26,200 పెట్టుబడి పెడుతున్నారు. యంత్రాలు, లేదా కూలీలతో చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతేడాది ఆర్‌బికెలు, డిఆర్‌డిఎ, సివిల్ సప్లయ్, ఎఫ్‌సిఐ ద్వార ధాన్యం కొనుగోలు చేసేది. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి అందుకు అనుగుణంగా కొనుగోలు చేసేవారు.

300 కేంద్రాలు...48 గంటల్లో నగదు:జెసి కార్తీక్

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది సుమారు మూడు వందల ఆర్‌బికె కేంద్రాల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాపితంగా ఆర్‌బికెలు ప్రారంభించామని, రైతులు ఎప్పుడు వచ్చినా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని "ప్రజాశక్తి"కి తెలిపారు. ఐదు లక్షల పుట్లు కొనుగోలు చేయడం టార్గెట్‌గా పెట్టుకున్నామని, 48 గంటల్లో నగదు చెల్లిస్తామని తెలిపారు. ట్రాన్స్‌పోర్టులో ఇబ్బందులు లేకుండా చేస్తున్నామని, తేమ శాతం కనుగోనే మిషన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. జిల్లా వ్యాపితంగా ఆర్‌బికె కేంద్రాలు పరిశీలించడానికి ఆ:శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేడు జిల్లాకు రానున్నారు. అందుకు అదికారులు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వంఈ క్రాప్ ద్వార కేవలం 3 లక్షల ఎకరాలు మాత్రమే నమోదు చేసుకున్నారు. సుమారు జిల్లా వ్యాపితంగా 7 లక్షల ఎకరాల్లో సాగిచేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఈ క్రాప్ లేకపోయినా కొనుగోలు చేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

నేడు రైతుల భారీ ర్యాలీ,

రైతులకు మద్దతు ధర కల్పించాలని కోరుతూ ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో రైతులు పెద్ద ఎత్తున ఆందోళకు సిద్ధమయ్యారు. ఇప్పటికే జిల్లా వ్యాపితంగా రైతులు సమాయత్తమయ్యారు. సాయంత్రం 3 గంటలకు స్థానిక ఎబిఎం కాంపౌండ్ నుంచి సుందరయ్య బొమ్మ, గాంధీబొమ్మ, విఆర్‌సి, మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. పెద్ద ఎత్తున రైతులు కదలొచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పులిగండ్ల శ్రీరాములు ఒక ప్రకటన లో కోరారు.

మంత్రి నాదెళ్ల మనోహర్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి -నెల్లూరు

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విజయవాడ వందే భారత్ ఎక్స్ ప్రెస్ లో సాయంత్రం నెల్లూరు రైల్వే స్టేషన్ కు చేరుకున్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కి టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభి, డి.ఎస్.పి లు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రంగయ్య, ఇతర ప్రజా ప్రతినిధులు, అభిమానులు అధికారులు, పెద్ద ఎత్తున పాల్గొని ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి రోడ్డు మార్గమున ఆర్ అండ్ బి అతిథి గహమునకు చేరుకున్నారు.

ఆప్కాస్ విధానం రద్దు చేయడం దారుణం

ప్రజాశక్తి-నెల్లూరు




నినాదాలు చేస్తున్న నాయకులు

ఆప్కాస్ ను రద్దుచేసి ప్రయివేటు ఏజెన్సీలకు పనులు అప్పగించే చర్యలను నిరసిస్తూ స్థానిక ఏసి నగర్ సెంటర్లో మున్సిపల్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టారు.శుక్రవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నగర కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ఆప్కాస్ ను రద్దు చేసే చర్యలు ఆపాలని, మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి కె. పెంచల నరసయ్య, గౌరవ అధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, నగర సిఐటియు నాయకులు పి. సూర్యనారాయణ, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి. కామాక్షమ్మ మాట్లాడారు. ఆప్కాస్ ను రద్దు చేసి కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకు కార్మికుల కడుపులు కొట్టే చర్యలకు పూనుకోవడం సరైన చర్య కాదన్నారు.పారిశుధ్య కార్మికులందరూ దళిత, గిరిజన తెగలకు చెందిన బలహీన వర్గాల వారని అన్నారు. వారి జీవితాలను మెరుగుపరిచే నిర్ణయాలు చేయాల్సిన ప్రభుత్వం హక్కులను మరింత దిగజార్చే విధంగా నిర్ణయాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.తక్షణమే ఆప్కాస్ రద్దు చేసే చర్యలు ఆపాలని, మున్సిపల్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికులు, ఉద్యోగులను ఐక్యం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు అల్లంపాటి శ్రీనివాసులు రెడ్డి, గోతం. మురళీ, బొమ్మ శ్రీధర్,యూని యన్ నాయకులు తాళ్లూరు. భాగ్యమ్మ, దయామణి, శేషం చిన్న,అలీసమ్మ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి-నెల్లూరు



మాట్లాడుతున్న శ్రీరాంప్రసాద్

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ రాంప్రసాద్ సిసోడియా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో పిజిఆర్ఎస్ ,రెవెన్యూ సదస్సులు, రీ సర్వే, భూ ఆక్రమణలు, భూ సంబంధిత కోర్టు కేసులు తదితర అంశాలపై జిల్లాలోని ఆర్‌డిఒలు, తహశీల్దార్లతో సమీక్ష చేశారు. ఈ సమీక్ష సమావేశంలో సిసోడియా మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లో వచ్చిన అర్జీలు రీ ఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా అర్జీలను పూర్తి స్థాయిలో విచారణ చేసిన తరువాత మాత్రమే డిస్పోస్ చేయాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చే అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు .సమస్యలతో వచ్చే అర్జీదారులను వెయిట్ చేయించకుండా వారి పట్ల గౌరవ మర్యాదలతో వ్యవహరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్, సూర్యతేజ, సబ్ కలెక్టర్ శ్రీ పూజ, డిఆర్ఓ జె .ఉదయ భాస్కర రావు, కావలి, ఆత్మకూరు ఆర్‌డిఒలు, జిల్లా సర్వే అధికారి, తహశీల్దార్లు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ స్టోర్స్‌లో తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు :ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ జనరల్ మేనేజర్ అస్సెస్మెంట్ ,ఎంక్వయిరీస్ ఎం.కృష్ణారెడ్డి విద్యుత్ శాఖ స్టోర్స్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌ఫార్మర్ అయిల్ డ్రమ్స్, కేబుల్ జాయింట్ కిట్స్, విసిబిలు, కాసారమ్స్ ఇతర సామగ్రిని తనిఖీ చేసి రికార్డ్స్ ను పరిశీలించారు. మెటీరియల్ స్టాక్ ను, మెటీరియల్స్ అన్ని రికార్డు ప్రకారం సక్రమంగా ఉన్నాయో లేదో అని రికార్డ్స్ ను పరిశీలించారు. ఫీల్డ్ నుండి వచ్చే మెటీరియల్ రిక్విజెషన్ కరెక్ట్‌గా ఇస్తున్నారా లేదా అని పరిశీలించారు.అనంతరం జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్ వి. విజయన్ ని మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అకౌంట్ ఆఫీసర్ విజిత ,డిస్టిక్ స్టోర్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శంకరయ్య ,అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ బొబ్బిలి సురేఖ, అసిస్టెంట్ ఇంజినీర్స్ మల్లికార్జున, ప్రసాద్ పాల్గొన్నారు.




నోటీసులు జారీ చేయండి

ప్రజాశక్తి-నెల్లూరు:నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో అనధికార, అక్రమ నిర్మాణాలను గుర్తించి వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలని వార్డ్ సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ కార్యదర్శులను కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశించారు. వారాంతపు సమీక్షలో భాగంగా కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క వార్డు ప్లానింగ్ కార్యదర్శి తమ సచివాలయాల పరిధిలోని మాస్టర్ డేటా ప్లాన్ ను తమ పని చేసిన కాలంలో భద్రపరచాలని సూచించారు.

ఆరు బ్రీత్ ఎనలైజర్లు అందజేత

ప్రజాశక్తి-నెల్లూరు :కలెక్టర్ సూచనల మేరకు 6 బ్రీత్ ఎనలైజర్ లను ఎస్పి జి.కృష్ణకాంత్‌కు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ సభ్యులు అందజేశారు. రోడ్ సేఫ్టీ కమిటీ సమన్వయ సమావేశంలో కలెక్టర్ ఒ ఆనంద్, ఎస్పి జి.కృష్ణకాంత్ చేసిన సూచనలు మేరకు, రెడ్ క్రాస్ సొసైటీ వారు 6 బ్రీత్ ఎనలైజర్‌లను, శుక్రవారం క్యాంప్ ఆఫీస్‌లో అందజేశారు.ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సంస్థ ఆపదలో ఉన్నవారికి సహాయ సహకారాలు అందిండంలో ఎప్పుడూ ముందుంటుంది రెడ్ క్రాస్ చైర్మెన్ వాకాటి విజయ కుమార్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మెన్ సిహెచ్.జనార్ధన్ రాజు, ట్రెజరర్ సురేష్ కుమార్ జైన్, ఎంసి మెంబెర్స్- కె.శ్రీహరి రెడ్డి, వై.సురేష్, డిస్ట్రిక్ట్ సెక్రెటరీ శ్రీ పి.మస్తానయ్య, ట్రాఫిక్ సిఐ వెంకటరెడ్డి, ఎస్‌బి-1 సిఐ వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.



ర్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :రైతు పండించిన ధాన్యానికి మద్ద తు ధర సాధించుకునేందుకు నిర్వహిస్తున్న ర్యాలీని జయప్రదం చేయాలని సిఐటియు మండల కమిటీ పిలుపునిచ్చింది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటీయు ఆధ్వర్యంలో శుక్రవారం తోటపల్లిగూడూరు మండలం పేడూరులో కరుపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి, సిఐటియు మండల కార్యదర్శి మారుబోయిన రాజా మాట్లాడారు.కృష్ణా రెడ్డి పాలెంలో కరపత్రాలు పంపిణి చేసి, పాపిరెడ్డి పాలెం, కోవెరపాలెం, కష్ణారెడ్డి పాలెం, పెదురు, నరుకూరు గ్రామాల లో ఆటో మైక్ ద్వారా ప్రచారం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో దామవరపు బాబు తన్నీరు ప్రభావతమ్మ, ఇనమాల ఏసోబు, ఉండ్రాళ్ళ రమ, బుట్టి నరసింహం, ఉయ్యాల బేబీ, తన్నీరు వెంకటేష్, తన్నీరు శ్రావణి, ఉయ్యాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న దృశ్యం

బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-కందుకూరు:స్థానిక ఎంఎంఎస్ ఆఫీస్ లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్ షాప్‌నకు ముఖ్య అతిథిగా శుక్రవారం కెనరా బ్యాంక్ మేనేజర్ రాము హాజరయ్యారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ అందరూ ఆర్థిక అక్షరాస్యతపై, సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాంకింగ్ సేవలపై పూర్తి అవగాహన కలిగి ఆర్థికంగా బలోపేతం చెందాలని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కందుకూరు ఏపిఎం సురేష్ మాట్లాడుతూ బ్యాంకులో లభించే వివిధ ఖాతాల గురించి, చిన్నతనం నుంచే బడ్జెట్ పై, ఆర్థిక ప్రణాళిక పై పూర్తి అవగాహన కలిగుండాలని తెలిపారు.ఈ వర్క్ షాప్ సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్ఫర్మేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ వి. ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ వి.అశోక్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు..అదేవిధంగా ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ అశోక్ మాట్లాడుతూ విద్యాలక్ష్మి పోర్టల్ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మరొక రిసోర్స్ పర్సన్ బాబురావు మాట్లాడుతూ కెవైసి పిన్ నెంబర్లను, ఓటిపి లాంటి వివరాలను ఇతరులకు తెలియజేయకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ట్రైనర్ అనిల్ మాట్లాడుతూ బ్యాంకులు అందించేటువంటి ఇన్సూరెన్స్ గురించి పూర్తి అవగాహన కలిగుండాలని మరీ ముఖ్యంగా పిఎంఎస్‌బివై,పిఎంజెజెబివై మీరు, మీ పిల్లలు తప్పకుండా బ్యాంకులో నమోదు చేసుకోవాలని తెలియజేశారు. చివరిగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ సురేష్ మాట్లాడుతూ మహిళలందరూ కు పొదుపు అనేది చాలా ముఖ్యమని పొదుపు చేసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలియజేశారు. కార్యక్రమంలో మహిళలు మహిళా మండల సమైక్య సిబ్బంది పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్లకు ఏసి సదుపాయం కల్పించండి

ప్రజాశక్తి-నెల్లూరు:రానున్న వేసవికాలం ఎండ తీవ్రత దృష్ట్యా నగరపాలక సంస్థ పరిధిలోని ఏడు అన్న క్యాంటీన్లలో ఏసి సదుపాయం కల్పించి, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ సూర్య తేజ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ శుక్రవారం 49వ డివిజన్లోని బిఇడి కాలేజీ, గవర్నమెంటు మోడల్ హైస్కూల్, దోర్నాల వీధి, ఈద్గా మిట్ట, గుండాల సుబ్బారెడ్డి తోట, జయలలిత నగర్ , పాత మున్సిపల్ ఆఫీసు రోడ్డు తదితర ప్రాంతాలలో పర్యటించారు. కార్యక్రమంలో ఎస్.ఈ. రామ్మోహన్, డిప్యూటీ కమిషనర్ చేన్నుడు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. చైతన్య , వెటర్నరీ డాక్టర్. మదన్మోహన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రహంతు జానీ రెవెన్యూ ఆఫీసర్ ఇనాయాతుల్లా, ఏ.సి.పి. ప్రకాష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, సచివాలయ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

అవకతవకలను ఉపేక్షించం

ప్రజాశక్తి - వలేటివారిపాలెం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వహణలో అవకతవకలను ఉపేక్షించేది లేదని పథకం సహాయ సంచాలకులు జి బాబురావు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఉపాధి ఉపాధి హామీ పథకం కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీలకు రూ 300/- తగ్గకుండా పనులు చేయించాలని చెప్పారు. మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో రైతు వారి కుంటలు 25 కు తగ్గకుండా నిర్మించాలన్నారు. గ్రామపం చాయతీలలో శ్రమ శక్తి సంఘాలను త్వరగా పూర్తి చేయాలని, అదేవిధంగా గ్రామాలలో పని అడిగిన ప్రతి కూలికి పనులు కల్పించాలని చెప్పారు. ఇప్పటివరకూ పనులు ప్రారంభం కానీ గ్రామపంచాయతీలో వెంటనే పనులు ప్రారంభించాలని ఏపిడి బాబురావు ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ కె టి ఉమా మహేష్,, ఈసీ వంశీకష్ణ, టి ఏ లు మాలకొండయ్య,, అశోక్, ప్రసాద్, నాగార్జున, చిన్నమాలకొండయ్య, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ లోన్లకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-కందుకూరు:స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పలు కార్పొరేషన్‌ల లోన్‌లకు బ్యాంకర్లు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కె.అనూష మాట్లాడుతూ ప్రభుత్వం పేదవారికి ఆసరాగా వారి ఆర్థిక అభివృద్ధిని మెరుగుపరిచేందుకు కార్పొరేషన్‌ల ద్వారా లోన్ సౌకర్యం కల్పించిం దన్నారు. వాటి కోసం ఆన్లైన్ ద్వారా అప్లై చేసుకున్న లబ్ధిదారులకు సంబంధిత బ్యాంకు వారు ఇంటర్వ్యూలు నిర్వహించి వారి పత్రాలను పరిశీలించారు. ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ ప్రకారం అర్హత కలిగిన వారికి తప్పకుండా లోన్ మంజూరు చేస్తారని తెలిపారు.

'బుర్రా'కు ధన్యవాదాలు

ప్రజాశక్తి-కందుకూరు:కందుకూరు మున్సిపాలిటీ ఆది ఆంధ్ర కాలనీ వాసులు శుక్రవారం మాజీ శాసనసభ్యులు, బుర్రా మధుసూదన్ యాదవ్ ను కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గ స్థాయిలో ఆది ఆంధ్ర కాలనీ వాస్తవ్యుడు ఉచ్చులూరి రవీంద్రను క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులుగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అవకాశం కలిపించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. క్రిస్టియన్ మైనారిటీ నియోజకవర్గ అధ్యక్షులుగా ఎన్నికైన రవీంద్రకు పూలబొకే అందించి అభినందనలు తెలియజేశారు.

కార్యకర్తలతో 'బుర్రా' భేటి

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు వైసిపి కార్యాలయం లో వివిధ మండల వైసిపి నాయకులు, కార్యకర్తలతో మాజీ శాసనసభ్యులు బు ర్రా మధుసూదన్ యాదవ్ శుక్రవారం సమావేశ మ య్యారు. మూడ్రోజులుగా కందుకూరులో ఉండి కార్యకర్తలు,నాయకులతో సమావేశాలు నిర్వహించారు.



వేడుకలలో పాల్గొనన సిద్ధార్థ విద్యార్థులు

మాతృభాష గొప్పది

ప్రజాశక్తి-కందుకూరు: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం వేడుకలు సిద్ధార్థ పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జి రామారావు మాట్లాడుతూ మనిషి జీవితంలో మొదట నేర్చుకునే మాతృభాష సహజంగా అబ్బుతుంది, అప్రయత్నంగా వస్తుందన్నారు. మనకు ఏదైనా ఒక విషయం మాతృభాషలో అర్థమైనట్లుగా వేరొక భాషలో అంత సులభంగా అర్థం కాదన్నారు. అందుకే ప్రతి బిడ్డ అమ్మను కాపాడుకున్నట్టే మాతృభాషను కాపాడు కోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం హరిబాబుతో పాటుఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-గుడ్లూరు రూరల్:గుడ్లూరు మండలం, చేమిడదపాడు గ్రామంలో స్పెషల్ ఆధార్ సెంటర్ ను సచివాలయంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ స్పెషల్ ఆధార్ సెంటర్‌లో 34 ఆధార్‌లు చేయడం జరిగిందని డిజిటల్ అసిస్టెంట్ హరినాథ్ తెలిపారు. ఈ ఆధార్ సెంటర్‌ను గుడ్లూరు మండల ఎంపిడిఒ వై వెంకటేశ్వరరావు పరిశీలించారు.

నిర్లక్ష్యపు అధికారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కందుకూరు



వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఐ నాయకులు

అగ్రిగోల్డ్ ఆస్తులు పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న వరికుంటపాడు తహశీల్దార్‌పై తీసుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏఓకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ వరికుంటపాడు మండలంలో అగ్రిగోల్డ్ సంబంధించిన భూములలో ఎర్రచందనం, జామాయిలు ఉన్నాయని, వాటిని కొంతమంది అక్రమార్కులు చెట్లను నరికి అమ్ముకుంటున్నారన్నారు. ఇది తెలిసిన రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సిఐడి కేసు దర్యాప్తులో ఉండగా అగ్రిగోల్డ్ ఆస్తులు కొల్లగొడుతున్న దొంగల పట్ల అధికారులు వ్యవహరిస్తున్న వైఖరి దొంగలతో అధికారులు కుమ్మక్కైనట్టు తెలుస్తుందని ఆరోపించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు మాట్లాడుతూ వరుకుంట పాడు మండలానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లో ఎర్రచందనం, జామాయిల్ చెట్లు నరుకుతుంటే పరిశీలించడానికి పోయిన తమపై అక్కడ చెట్లు నరికి అమ్ముతున్న వారు దాడి చేసి మమ్మల్ని నోటికి వచ్చినట్టు బూతులు తిట్టి మీ అంత తేలుస్తామంటూ మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేసినా ఎస్సై తన సిబ్బందితో అక్కడికి వచ్చి వారిని పేరుపేరునా పిలిచి వెళ్ళండి గొడవ వద్దంటూ వారికి సర్ది చెప్పి పంపించారని తెలిపారు. వారిపై ఇప్పటికి కేసు పెట్టలేదని ఇందులో ఎస్సై కి కూడా వాటా ఉన్నట్టు తెలుస్తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు వారిపై కఠిన చర్యలు తీసుకొని అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి. మాలకొండయ్య మాట్లాడుతూ ఫిబ్రవరి 24వ తేదీ కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరగాలని నిరసన కార్యక్రమం జరుగుతుందని, అందరు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు, బోయపాటి శ్రీను, దుర్గాప్రసాద్, మాధవరావు, శ్రీనివాసరావు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, బాషా పాల్గొన్నారు.

వేలంపాట వాయిదా

ప్రజాశక్తి-వలేటివారిపాలెం



మాట్లాడుతున్న అధికారులు

మండలంలోని మాలకొండలో ఆలయ అధికారులు నిర్వహించిన బహిరంగ వేలం పాటలు శుక్రవారం రెండో సారి కూడా వాయిదా పడ్డాయి. మాల కొండలో కళ్యాణ మండపంలో పర్యవేక్షణా ధికారి బైరాగిచౌదరి పర్యవేక్షణలో షాపులకు బహిరంగ వేలం పాటలు జరిగాయి. ఈ నెల 7వ తేదీ శుక్రవారం నిర్వహించిన వేలం పాటల్లో, తలనీలాలు వేలం పాట మాత్రమే సిల్ టెండర్ ద్వారా పూర్తయింది. మిగిలిన 11 షాపులు సరైన పాట రానందున ఆలయ అధికారులు వాయిదా వేశారు. వాయిదాపడిన 11 షాపులకు రెండోసారి శుక్రవారం నిర్వహించారు. అయితే 11 షాపులకు వేలం పాటలు నిర్వహించంగా కొండపైన బొమ్మల అంగడి 1 వేలం పాటను మాలకొండకు చెందిన కామినేని శివయ్య రూ 5 లక్షలకు. బొమ్మల అంగడి 2 షాపును మాలకొండకు చెందిన కామినేని మాధవరావు రూ. 4 లక్షలకు, కొండపైన ఫలహారశాల అంగడిని మాలకొండకు చెందిన వంకదారి కొండయ్య రూ. 10.30 లక్షలకు పాటలు దక్కించుకున్నారు. మిగిలిన కొబ్బరి చిప్పలు, పాలు నెయ్యి, టోల్ గేట్, అమవారికి చీరలు, జాకెట్ సమర్పించు పాట, కొబ్బరికాయలు అమ్ముకునే అంగడి, ఫొటోలు, పూజాద్రవ్యములు, కూల్డ్రింక్స్ పాదరక్షలు పాటలకు పాటదారులు డిపాజిట్ చెల్లించకపోవడం ఒకట్రెండు పాటలకు ఒకరిద్దరూ డి. పాజిట్లు చెల్లించినప్పటికి సరైన పాటలు రానందున ఆలయ అధికారులు వాయిదా వేశారు. వాయిదా పడిన 8 పాటలు తిరిగి మళ్లీ ఈ నెల 28వ తేదీ పెట్టనున్నట్లు ఆలయ అదికారులు ప్రకటించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటి కమిషనర్ కే.వీ సాగరబాబు, పర్యవేక్షణాధికారి బైరాగిచౌదరి, ఆలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు తదితర ఆలయ సిబ్బంది. పాల్గొన్నారు.

విమానాశ్రయం భూములు పరిశీలన

ప్రజాశక్తి-దగదర్తి

మండల పరిధిలోని దామవరం వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న విమానాశ్రయ భూములలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందం వారు శుక్రవారం పరిశీలించారు. అక్కడికి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, కావలి ఎంఎల్ఎ వెంకట కావ్య కృష్ణారెడ్డి, కలెక్టర్ ఆనంద్ అక్కడ చేరుకొని విమానాశ్రయం మ్యాప్‌ను వివరించారు. ఈ సందర్భంగా ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వంలో మనం భాగస్వామ్యంగా ఉండడంతో అనేక పరిశ్రమలు ఏర్పాటుతో అభివృద్ధి పనులు మొదలవుతాయని తెలిపారు. నెల్లూరు జిల్లా బిపిసిఎల్ ఇండో వంటి పెద్దపెద్ద పరిశ్రమంలో ఏర్పాటు ఏర్పడతాయన్నారు. పరిశ్రమంలో ఏర్పాటుకు ఆయా గ్రామాల గ్రామస్తులతో చర్చలు జరిపి వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పర్యావరణానికి నిబంధనలు మేరకు అనుమతులు ఇచ్చేలా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఎంతో కష్టపడుతున్నారని తెలిపారు. కేంద్ర మంత్రులతో నిధులు మంజూరుకు కేంద్ర జల్‌శక్తి మంత్రిని కలిసి చలో జీవన్ మిషన్ ద్వారా



శిలాఫలకం వద్ద ప్రతినిధులు

ఇంటింటికీ కొళాయి కనెక్షన్ మంజూరు కోసం అదేవిధంగా పోలవరం అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేరే సమయం ఆసన్నమైందని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు అన్నారు. దగదర్తి ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుతో పారిశ్రామిక రంగానికి నెల్లూరు జిల్లా ఒక దిక్సూచిలా మరనుందన్నారు. 2019 జనవరి 6న సిఎం హోదాలో చంద్రబాబు విమానాశ్రయం ఏర్పాటుకు భూమి పూజ చేశారని, ఆ సమయంలో తాను కావలి ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. మళ్లీ ఇప్పుడు తాను ఎంపిగా ఉన్న సమయంలో విమానాశ్రయం పనులు ప్రారంభం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. సుమారు రెండేళ్లలోనే ఈ పనులన్నీ కూడా పూర్తయి విమానాశ్రయం అందుబాటులోకి వస్తుందన్నారు. రైతులందరూ కూడా తమ బిడ్డల భవిష్యత్తు కోసం భూములను ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని, ఎవరికి ఇబ్బందుల్లేకుండా నష్టపరిహారం చెల్లించేందుకు కలెక్టర్ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం కావలి ఎంఎల్ఎ దగ్గుపాటి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ 2019లో దగదర్తి విమానాశ్రయం ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భూమి పూజ చేశారన్నారు. గత ప్రభుత్వం పూర్తిగా విమానాశ్రయం నిర్లక్ష్యం చేయడంతో పనులు నిలిచిపోయాయన్నారు. కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు ప్రత్యేక కృషి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీద మస్తాన్‌రావు చొరవతో మళ్లీ ఎయిర్‌పోర్ట్ మొదలైందని తెలిపారు. రామాయపట్నం పోర్టు, కృష్ణపట్నం పోర్టు అనుసంధానంగా దామవరంలో విమానాశ్రయాన్ని నిర్మించాలని జిల్లాలో పారిశ్రామిక ప్రగతి సాధించాలనే గొప్ప లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విమానాశ్రయానికి ఏర్పాటుకు చర్యలు చేపట్టారని తెలిపారు. డిపిఆర్‌లో తయారుచేసి రూ.96కోట్లు నిధులు విడుదలకు సిఎం ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.కృష్ణ, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

భూముల సేకరణ కోసం గ్రామసభ

ప్రజాశక్తి-కందుకూరు/గుడ్లూరు రూరల్

గుడ్లూరు మండలం రావూరు గ్రామంలో భూ సేకరణ కోసం శుక్రవారం జరిగిన గ్రామసభలో కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు, సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ పాల్గొని రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. రైతులకు మేలు జరిగే విధంగా ప్రయత్నం చేస్తామని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో కనీసం గ్రామసభ నిర్వహించకుండా రైతులు అభిప్రాయాలు తీసుకోకుండా భూసేకరణ ధర నిర్ణయం చేశారని, కానీ కూటమి ప్రభుత్వం ఆ గ్రామంలో ఉన్న ప్రజలతో గ్రామసభ నిర్వహించి వారి అభిప్రాయాలు అనుగుణంగా పని చేస్తుందని తెలిపారు. రామాయపట్నం పోర్ట్ రావడం అదృష్టమని సింగరాయకొండ ఎస్ఆర్ఓ రేట్ల ప్రకారం ధర నిర్ణయించడం సబబు కాదని తెలిపారు. అభిప్రాయాలను తెలుసుకుని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులపై నిబద్ధతతో ఉన్నారన్నారు. రైతులకు అందించే పరిహారం విషయంలో రైతుల నష్టపోకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళ్తానన్నారు. రైతులు భూ సమస్యలపై దూర ప్రాంతాలు ప్రయాణించకుండా విఆర్ఒలు, ఆర్ఐ, అధికారులు గ్రామంలో ఉండే రైతులు సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

ప్రణాళిక పుస్తకం ఆవిష్కరణ



ప్రజాశక్తి -నెల్లూరు : ప్రపంచ "రెడ్ బుక్ డే" సందర్భంగా శుక్రవారం వేదయపాలెంలోని మన్సూర్ భవన్లో కమ్యూనిస్టు ప్రణాళిక బుక్‌ను సిపిఎం రూరల్ నాయకులు, కార్యకర్తలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం రూరల్ ఎడ్యుకేషన్ సబ్ కమిటీ ఆధ్వర్యంలో "రెడ్ బుక్ డే" పైస్టడీ సర్కిల్ నిర్వహించారు . ఈ స్టడీ సర్కిల్‌కు ఎడ్యుకేషనల్ రూరల్ సబ్ కన్వీనర్ దేవతాటి సంపత్ కుమార్ అధ్యక్షుడు వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టు ప్రణాళిక అంశంపై జిల్లా ఎడ్యుకేషన్ కమిటీ కన్వీనర్ అనిల్ బోధించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య, ఇ.ఎస్. బాబు, బి.నాగేశ్వరరావు, కట్టా సతీష్, నందిపాటి మాలకొండయ్య, వీర్ల శ్రీనివాసులు, కండె కోటేశ్వరరావు, డివైఎఫ్ఐ రూరల్ కన్వీనర్ గోను చైతన్య, సిపిఎం శాఖ కార్యదర్శులు ఓ.సుధీర్, ఎస్‌కె జావీద్, కరిపం కృష్ణమూర్తి, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



ప్రజాశక్తి-కందుకూరు : బ్యాంక్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కందుకూరులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్, కందుకూరు రీజనల్ ఆఫీస్ సిబ్బందితోపాటు ఇతర బ్యాంకుల నుండి యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ సభ్యులందరూ నిరసనలో పాల్గొన్నారు. బ్యాంక్‌లో ప్రతి కేడర్లో ఉన్న అన్ని రిక్రూట్మెంట్స్ జరపాలని, ఐదు రోజుల పని దినాలను కల్పించాలని, వర్క్ ఎన్విరాన్‌మెంట్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, ఔట్సోర్సింగ్ జాబ్స్‌ను ఆపేయాలని కోరారు. 12వ వేతన సవరణలో మిగిలిన పెండింగ్ సమస్యలన్ని పరిష్కరించాలని, బ్యాంకుల ప్రయివేటీకరణ నిలిపివేయాలని ప్రధాన అజెండాగా నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే మార్చి నెల 24, 25 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెకు పిలుపు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో కందుకూరు మెయిన్ బ్రాంచ్ లోకల్ సెక్రెటరీ నరేష్, సెక్రటరీ శ్రీనివాసులు, రీజనల్ ఆఫీస్ సెక్రటరీ కిరణ్ ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి



ప్రజాశక్తి-ఉదయగిరి : స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ నిధులతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల జి.చెర్లోపల్లి, వడ్డే పాలెం పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి అన్ని తరగతుల విద్యార్థుల అభ్యసన, పఠన సామర్థ్యాలను నైపుణ్యాలను పరిశీలిస్తూ విద్యార్థుల సామర్థ్యాలు వారి తరగతి స్థాయి కంటే మిన్నగా ఉన్నవని ఉపాధ్యాయినులను అభినందించారు. వడ్డేపాలెం పాఠశాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫెసిలిటీస్ పరిశీలిస్తూ పాఠశాల మరమ్మతులు, కిటికీలు, తలుపులు, ప్రహరీగోడ తదితర సదుపాయాలకు మరమ్మతులకు పాఠశాలలను స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ కార్యక్రమంలో పెట్టి ఆ నిధులతో పూర్తి అభివృద్ధికి కృషి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వి.లక్ష్మీకాంతమ్మ, ఉపాధ్యాయురాలు విమల, ఎస్ఎంసి చైర్మన్ మహేశ్వరి, సిఆర్ఎం టి.మాల్యాద్రి పాల్గొన్నారు.

మార్చిలోపు నిర్మాణాలు పూర్తిచేయాలి

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని గ్రామాల్లో గృహ నిర్మాణాలు మరింత వేగవంతం చేసి మార్చిలోగా నూరుశాతం పూర్తిచేసేలా సంబంధిత మండలాల ఎఇలు ప్రత్యేక దృష్టి పెట్టాలని గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మోహన్ అన్నారు. కోవూరులోని గృహ నిర్మాణ శాఖ డిఇ కార్యాలయంలో శుక్రవారం కోవూరు నియోజకవర్గ పరిధిలోని గృహ నిర్మాణ శాఖ ఎఇలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమన్వయం చేసుకుని లబ్ధిదారుల్లో అవగాహన కల్పించి మార్చి నాటికి ఇచ్చిన లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. సమీక్షలో గృహ నిర్మాణ శాఖ ఇన్‌ఛార్జి డిఇ వెంకటేశ్వర్లరెడ్డి, ఎఇ మాధవయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా 'కోటా'



ప్రజాశక్తి-కందుకూరు : జరుగుమల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా కోటా కిషోర్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వలేటివారిపాలెం మండల అర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా గోనుగుంట వెంకటేశ్వర్లు ఎన్నుకున్నారు. ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోటా హనుమంతరావు ఆదేశంతో కందుకూరు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో జరిగిన సమావేశంలో ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు ఎన్నికల అధికారిగా, వాసవి సేవాదళ్ ఉపాధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు, వాసవి సేవాదళ్ కోశాధికారి ఇన్నమూరి శ్రీనివాసుల పర్యవేక్షణలో జరిగిన సమావేశంలో కోటా కిషోర్‌బాబును మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పిఎం గుర్రం వెంకటరావు, గోనుగుంట వెంకటేశ్వర్లు, గోనుగుంట సురేష్, ఇన్నమూరి చంద్రశేఖర్, గోనుగుంట గురుబ్రహ్మం పాల్గొన్నారు.

క్షయ రహిత గ్రామాలే లక్ష్యం

ప్రజాశక్తి-ఉదయగిరి : గ్రామాలను క్షయరహితంగా మార్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని గండిపాలెం పిహెచ్‌సి వైద్యులు [illegible] వెంకటసుబ్బయ్య కోరారు. శుక్రవారం ఆయన మండలంలోని [illegible] పాఠశాలలను ఆయన సందర్శించి ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడారు. క్షయ వ్యాధి, క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి తుంపర్ల ద్వారా ఒకరి నుండి ఒకరికి వ్యాప్తి చెందుతుందని, [illegible] ఈ వ్యాధి నుండి రక్షణ పొందుటకు మంచి పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివరామిరెడ్డి, ఉపాధ్యాయులు రమేష్, షేక్ జలీల్, సురేంద్ర, ఖాదర్‌బాషా, ఆరోగ్య శాఖ సిబ్బంది జ్యోతిప్రభాని, జమీల, శిరీష, జ్యోతి, సుజాత పాల్గొన్నారు.

విద్యార్థినులకు కంటిఅద్దాలు పంపిణీ



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటి అద్దాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు డివిజన్ స్థాయిలో 6 మండలాలకు గాను 591మంది కంటి అద్దాలు ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి చండ్రా వెంకట సుబ్బారాయుడు పాల్గొన్నారు. గురుకుల పాఠశాలకు ఎంపికైన 60మంది విద్యార్థినులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పారామెడికల్ అసిస్టెంట్ కంటి వైద్యనిపుణులు డాక్టర్ సుబ్రహ్మణ్యం ఆర్.వినోద్, ప్రిన్సిపాల్ కామేశ్వరి పాల్గొన్నారు.

నేత్రాల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కోవూరు : మానవుని శరీరంలో అత్యంత ముఖ్యమైన నేత్రాలపై నిర్లక్ష్యం చేస్తే జీవితం అంధకారం అయ్యే పరిస్థితి వస్తుందని, కావున తగిన జాగ్రత్తలు పాటించాలని మండల పరిషత్ అధ్యక్షురాలు టి.పార్వతి తెలిపారు. కోవూరులోని పడ్డుపాల రామానాయుడు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో 90 మంది విద్యార్థినులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రభుత్వం ఇచ్చిన ఈ సదుపాయాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆప్తమాలిక్ అసిస్టెంట్ కె.లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ఇటీవల కాలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయిని భారతి, ఫిజికల్ డైరెక్టర్ దేవిక, ఉపాధ్యాయురాలు గీతావాణితోపాటు పలు సూచనలు చేశారు.

చెత్త కేంద్రాలలో పరిశీలన

ప్రజాశక్తి-వరికుంటపాడు : చెత్త కేంద్రాలను తప్పనిసరిగా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికను తయారు చేయాలని అందుకు సంబంధించి సిద్ధమవ్వాలని కార్యదర్శులకు ఇఓపిఆర్‌డి నాగురువల్లి సూచించారు. శుక్రవారం మండలంలోని విరువూరు, కృష్ణంరాజు పల్లి చెత్త కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని కేంద్రాలను నెలాఖరులోపు వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభుదాసు, మండల కోఆర్డినేటర్ రమణయ్య పాల్గొన్నారు.

టిబివ్యాధి నివారణపై అవగాహన

ప్రజాశక్తి కోవూరు : మండలంలోని ఇనమడుగు, లేగుంటపాడు ఉన్నత పాఠశాలల్లో ఆరోగ్య సిబ్బంది, సూపర్‌వైజర్లు ఎస్‌కె దిలీప్, సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు టిబి వ్యాధి నివారణపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక దశలో ఈ లక్షణాలు కనిపించిన వెంటనే ఉచితంగా ఈ వ్యాధికి సంబంధించిన నిర్ధారణ పరీక్షలను సామాజిక ఆరోగ్య కేంద్రంలో గానీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గానీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు కె. చంద్రశేఖర్, వి. బాలాజీ ప్రసాద్, పెంచలమ్మ, సిహెచ్ కావలి, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకానికి నిధులు పెంచాలి

ప్రజాశక్తి-కావలి



మాట్లాడుతున్న నాయకులు

ప్రజావ్యతిరేక మైన కేంద్రబడ్జెట్‌ను ఉప సంహరించుకుని, ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, సిపిఎం సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం కావలి మండల కార్యదర్శి మారుపూడి రాధాకృష్ణయ్యలు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పెట్టిన బడ్జెట్‌లో ప్రజల కొనుగోలు శక్తి కుంచించుకుపోయే విధంగా ఉందన్నారు. నిరుద్యోగ సమస్యలు విస్మరించినదన్నారు. ఆహార సబ్సిడీలు, వ్యవసాయానికి, విద్య, వైద్యం, గ్రామాభివృద్ధికి, ఉపాధి హామీ పథకానికి గత ఏడాదికంటే ఇప్పటి బడ్జెట్‌లో తగ్గించారని విమర్శించారు. ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు అయిన వ్యవసాయ ఉత్పత్తులకు, కనీస మద్దతు ధరకు చట్టభద్దత కల్పించాలని కోరారు. ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటీకరించడం ఆపాలని కోరారు. ఆరోగ్య రంగానికి, విద్యారంగానికి కేటాయింపులు పెంచాలన్నారు. ఉపాధి హామీ పథకానికి రూ.2 లక్షల 50వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మహిళా శిశు సంక్షేమానికి కేటాయింపులు పెంచాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి-కావలి



జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కావలి పట్టణ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 21వ తేదీ నుండి 28 వరకు జరిగే సైన్స్‌డే వారోత్సవాల మొదటి రోజు శుక్రవారం రెడ్‌క్రాస్ భవన్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జెవివి పట్టణ కమిటీ బాధ్యులు డాక్టర్ పి.శివప్రసాద్ పోటీలను ప్రారంభిస్తూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సంవత్సరమంతా వివిధ కార్యక్రమాలు జరుగుతుంటాయని, సమాజంలో పేరుకుని ఉన్న మూఢ విశ్వాసాలను తొలగించి శాస్త్రీయ దృక్పథాన్ని పెంచి, పర్యావరణాన్ని పరిరక్షించుకునే క్రమంలో జన విజ్ఞాన వేదిక పయనం సాగిస్తుందన్నారు. దానిలో భాగంగా ఫిబ్రవరి 28న సర్ సి.వి.రామన్, రామన్ ఎఫెక్ట్ కనుగొన్న రోజును 'సైన్స్ డే'గా దేశవ్యాప్తంగా జరుపుకుంటారని తెలిపారు. రేపటి పౌరులైన నేటి బాలల్లో శాస్త్రీయత పెంచేవిధంగా వివిధ అంశాలను ఎంపికచేసి, వివిధ పోటీలను ఈ వారం నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈరోజు జరిపే వ్యాసరచన పోటీ నేటి ప్రబల సమస్యగాబోతున్న "నీటి వనరుల సక్రమ వినియోగం, నీటి వృథాను అరికట్టడంపై విద్యార్థులకు ఆలోచన పెంచేవిధంగా జరుపుతున్నట్లు తెలిపారు. వ్యాసరచనన పోటీలో 8, 9, 10 తరగతుల విద్యార్థులు సీనియర్లుగా 6, 7 తరగతుల విద్యార్థులు జూనియర్లుగా పోటీలు నిర్వహించారు. సుబ్బరామశర్మ, కె.హరినారపరెడ్డి, షేక్.ఖాదర్‌బాషా, సి.శారద, ఎ.రమణయ్య, ప్రసాద రావు, కె.జాన్, జానకిరామ్, కె.నారాయణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం నిర్వహించిన చిత్రలేఖన పోటీలో 23 పాఠశాలల నుండి సీనియర్స్ 65మంది, జూనియర్స్ 21 పాఠశాలల నుండి 63 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జెవివి పట్టణ కోశాధికారి సుబ్బరామశర్మ, సి.శారద, ఎంవిఎన్ ప్రసాదరావు, జానకిరామ్, జమున తదితరులు చిత్రలేఖన పోటీలు నిర్వహణ బాధ్యత వహించారు. పోటీల్లో భాగంగా శనివారం ఉదయం వక్తృత్వ పోటీలు సాయంత్రం సందేశాత్మక పాటల పోటీలు జరుగుతాయని జెవివి అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు తెలియజేశారు.

ప్రజాసమస్యలు పట్టని కాంట్రాక్టర్

ప్రజాశక్తి-ఇందుకూరుపేట



నిరసన తెలియజేస్తున్న నరసాపురం గ్రామస్తులు

లాభాపేక్షతో ప్రజల సమస్యలను కాంట్రాక్టర్ గాలికి వదిలేసాడని టిడిపి బిసిసెల్ నాయకులు గంపల అనిల్ పేర్కొన్నారు. శుక్రవారం మండలం లోని నరసాపురం గ్రామంలోని దళిత కాలనీవాసులతో కలిసి ధర్నా చేపట్టారు. సుమారు గంటపాటు రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ మూడో మైలు నుండి మైపాడు బీచ్ వరకు ప్రతిష్టాత్మకంగా వేస్తున్న రోడ్డులో కాంట్రాక్టర్ వ్యవహారంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారన్నారు. సైడ్ డ్రెయిన్లు తవ్వి 15 రోజులు గడుస్తున్న ప్రజలు తమ నివాసాలకు వెళ్లేందుకు దారి చూపకుండా అలాగే వదిలేశారన్నారు. విద్యార్థుల దగ్గర నుంచి ముసలి వాళ్ల వరకు కాలువను దాటేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారని, పలుమార్లు కాంట్రాక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లిన ఫలితం లేదన్నారు. ఆటో కార్మికులు కూడా దారి లేక జీవనోపాధి కోల్పోయారన్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు రోడ్డు పనులపై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానికులు మధు, రఘురామయ్య, మురళి, శీను, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల మాతృభాష దినోత్సవ వేడుకలు



కావలిలో తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కావలి

స్థానిక విశ్వోదయ బాలురఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు ఎన్.ద్వారకనాథ్ చౌదరి అధ్యక్షత వహించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయిని సి.శారద ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడుతూ ప్రపంచంలో ఉన్న 7వేల భాషల్లో ఎక్కువ వాడుకలో ఉన్న భాషలకే దీర్ఘకాలిక మనుగడ ఉంటుందన్నారు. మాతృభాషను అమ్మభాష అనడం వెనుక తల్లిగర్భం నుండి భూగర్భం మీద పడినప్పటి నుండి జీవించినంతకాలం మాట్లాడుకునే గొప్పభాష మాతృభాషగా ప్రత్యేకతగా విలసిల్లుతుందన్నారు. బంగ్లాదేశ్ ఏర్పడినప్పుడు మాతృభాషగా ఉర్దూను ప్రకటించిన దానికి వ్యతిరేకంగా, బెంగాలీని ప్రతిపాదించాలని జరిగిన ఉద్యమంలో నలుగురు విద్యార్థులు ప్రాణత్యాగం చేయడంతో, ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ, 'యూనెస్కో' ఫిబ్రవరి 21వ తేదీని అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రకటించి, ఏయే దేశాలు ఆయా దేశాల మాతృభాషలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రభుత్వాలు కృషిచేసే రోజుగా మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకోవాలని పిలుపునిచ్చిందన్నారు. సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి మాట్లాడుతూ గ్రాంథికంగా ఉన్న తెలుగును వ్యావహారిక భాషోద్యమ నేత గిడుగు రామమూర్తి ప్రజల వాడుక భాషగా ఎలా మార్చారో వివరిస్తూ తెలుగులో డిక్షనరీని తెచ్చి తెలుగుభాషకు ఎనలేని కృషి ఆంగ్ల మేధావి బ్రౌన్ ఎలా కృషి చేశారో వివరించారు. ఇంగ్లీష్ మీడియంలో విద్యనభ్యసించినా, తెలుగును కచ్చితంగా అభ్యసించి అభివృద్ధి చేయడానికి గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని ఉపాధ్యాయుడు చిలకల బ్రహ్మయ్య విద్యార్థులను కోరారు. ముందుగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వక్తలు తెలుగుతల్లి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో పాఠశాల గ్రేడ్ 1 హిందీ పండిట్ జి.కల్యాణి, టి.శ్రీనివాసరెడ్డి, పిఇటి కె.శివకుమార్ రెడ్డి, తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలోని బిజ్జంపల్లి జెడ్‌పి పాఠశాలలో శుక్రవారం భాషా వారోత్సవాలో భాగంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం తెలుగుభాష దినోత్సవాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్.నాయబ్ ప్రారంభించారు. అనంతరం హిందీ ఉపాధ్యాయులు షేక్.అక్బర్ బాషా, తెలుగు ఉపాధ్యాయిని బి.రమణమ్మ, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు బి.బ్రహ్మయ్య ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ-2 తోట.శ్రీనివాసులు మాట్లాడుతూ దేశభాషల యందు తెలుగు లెస్సా అని అత్యంత మధురమైన, తీపి మాతృభాష తెలుగు అని తెలిపారు. విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, చిట్టికథల పోటీలు, చమత్కారం పద్యాలు, చాటుపద్యాలు, క్విజ్‌పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సహోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సీతారామపురం : సీతారామపురంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా ఉత్సాహవంతంగా, మాతృభాషా దినోత్సవాలు నిర్వహించారు. తెలుగు బాషా గురించి, నేర్పించి పిల్లలతో ప్రదర్శించారు. మాతృభాష గురించి అందరికి తెలియాలని తెలుగుభాష ఉపాధ్యాయులు సుమతి, వెంకట సుబ్బయ్య, వాణి, సుబ్బారాయుడు, ముందుకి వచ్చి పిల్లలతోఎ పండరి భజనలు, కోలాటలు, సంప్రదాయమైన వస్త్రాలు ధరించి తెలుగుభాష గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు, ఎమ్.వెంకట సుబ్బయ్య, ఎమ్.సుమతి, కె.వాణి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండల కేంద్రమైన వరికుంటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు డి.వీరబ్రహ్మద్రయ్య, తెలుగు ఉపాధ్యాయురాలు కె.సుభద్ర ఆధ్వర్యంలో శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాలరావు, మౌలాలి, కొండలరావు, చంద్రమౌళి, సుజాత, రాజమోహన్ రెడ్డి, రంగయ్య, ప్రసాదు, ఉప్పు కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం తెలుగుసభ, హ్యాపీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాతృభాష సేవా శిరోమణి అంతర్జాతీయ కవి డాక్టర్ పెరుగు రామకృష్ణ మాట్లాడుతూ అన్ని భాషల్లో కల్లా తెలుగు భాష వైవిద్యభరితమైన భాష అని, పాశ్చాత్య భాషల వ్యామోహంలో నేటి యువత మాతభాష ప్రధాన్యాన్ని గుర్తించడం లేదన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సందీప్‌కుమార్, ఇఇఇ విభాగాధిపతి డాక్టర్ రవికుమార్లు పలు సూచనలు చశారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

గౌతమ్‌రెడ్డి సేవలు మరువరానివి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



గౌతమ్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రతిపక్ష ఎంఎల్ఎగా ఐదేళ్లు, అధికార పక్షంలో మంత్రిగా రెండున్నరేళ్లలోనే దివంగత పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గానికి అందించిన సేవలు నిరుపమానమని వైసిపి నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తృతీయ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్‌లో జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, సీనియర్ నాయకులు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డిల ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వసించారు. ఈ సందర్భంగా ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రాజకీయాల్లో అన్ని పార్టీల నాయకుల మన్ననలను పొందిన మహోన్నత వ్యక్తి గౌతమ్ రెడ్డి అని, ఆయన తమ మధ్య లేరన్న విషయాన్ని ఇప్పటికి నమ్మలేకున్నామని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ఆయన సోదరుడు, మాజీ ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి సారథ్యంలో నడుస్తామన్నారు. గౌతమ్ రెడ్డి విగ్రహానికి నివాళి అర్పించారు.

గౌతమ్‌రెడ్డి విగ్రహానికి నివాళులు

ప్రజాశక్తి-సంగం



సంగంలోని పెన్నా బ్యారేజీ వద్ద వైసిపి నాయకులు రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు దివంగత నేత మేకపాటి గౌతమ్ రెడ్డి మూడవ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గౌతమ్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మంత్రిగా చేసిన సమయంలో రాష్ట్రానికి, నియోజకవర్గానికి చేసిన సేవలను కొనియాడారు. గౌతమ్ రెడ్డి వివాదరహితుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు. రాజకీయ అజాత శత్రువు ఎవరైనా ఉన్నారంటే అది దివంగతనేత మేకపాటి గౌతమ్‌రెడ్డి అని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పెరుమాల్ల రవీంద్రబాబు, రాంబాబు, జహంగీర్, శివ, యందాసి మహేష్ పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యలో బొగ్గుల బట్టీ..

- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లిలో గ్రామ నడిబొడ్డులో ఎలాంటి అనుమతులు లేకుండా బొగ్గుల బట్టీని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఏర్పాటు చేసి నిత్యం గ్రామంలో పొగ, గాలిలో దుమ్ము ఇళ్లల్లోకి వస్తూ ఉండటంతో పలువురు గ్రామస్తులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వచ్చి బొగ్గుల బట్టి తీసివేసి కాలుష్యాన్ని నియంత్రించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని రైతులు రైతు సేవాకేంద్రంలో యూనిక్ నెంబర్‌ను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని టి.రజని పత్రికా ముఖంగా తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని రైతులందరూ వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సహాయకులను కలిసి రైతు రిజిస్ట్రేషన్ 27వ తేదీ లోపు చేయించుకుని, యూనిక్ నెంబరును పొందాలని అందుకుగాను ఆధార్ కార్డు, వన్‌బి, రైతు పాస్‌పుస్తకం, ఒటిపి వచ్చే ఫోన్ తీసుకొని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు.

దరఖాస్తులు పరిశీలన

ప్రజాశక్తి-సీతారామపురం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం బిసి, ఒసి, కాపు, కార్పొరేషన్‌కు అప్లై చేసుకున్న లబ్ధిదారుల ధరకాస్తులను ఎంపిడిఒ భాస్కర్, కెనరా బ్యాంకు మేనేజర్ జస్వంత్, పంజాబ్ నేషనల్ బ్యాంకు మేనేజర్ సునీల్, బ్యాంకు సిబ్బంది ఆధ్వర్యంలో బ్యాంకర్స్ ద్వారా వెరిఫై చేశారు. ఎంపిడిఒ భాస్కర్ మాట్లాడుతూ సీతారామపురం మండలం మొత్తం మీద 247 మంది ఈ బిసి కార్పొరేషన్ లోన్లుకు అప్లై చేసుకున్నారని తెలిపారు. ఇప్పటికీ తాము 42మందిని ఇంటర్వ్యూ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ భాస్కర్, ఇఒపిఆర్‌డి భార్గవి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కేన్సర్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కావలి



జవహర్ భారతి నర్సింగ్ కళాశాలలో శుక్రవారం కేన్సర్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్తేర్ బ్యూలా అధ్యక్షత వహించారు. వారు నర్సింగ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరూ బాల్యం నుంచే మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలని, అలాగే అనారోగ్యం సంభవించి నప్పుడు దానికి ఉన్న పూర్వాపరాలను కూలంకషంగా తెలుసుకుని తగిన వైద్యంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన నెల్లూరు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ క్యాన్సర్ ఆసుపత్రి ఛీఫ్ మెడికల్ ఆఫీసర్ అయిన డాక్టర్ టి.లక్ష్మీ ప్రసంగిస్తూ కేన్సర్ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే దానిని నివారించడం, జీవిత కాలాన్ని పొడిగించడం సాధ్యమని తెలుపుతూ ప్రతిఒక్కరూ కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. చిన్న వయసులో వాళ్ళు కేన్సర్ వ్యాక్సిన్ గడువు ప్రకారం వేసుకోవాలని తెలిపారు. జవహర్ భారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు ప్రసంగిస్తూ కేన్సర్ వ్యాధి చెడు అలవాట్లు ఉన్న వారికి మాత్రమే వస్తుందని, మిగతా వారికి రాదని అపోహతో ఉండటం, గంభీరంగా, ధైర్యంగా ఉండటం సరికాదని కొంత వయసు తర్వాత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అలాగే జవహర్ భారతి స్వయం ఉపాధి కోర్సుల సంచాలకులు డాక్టర్ ఆర్.మాల్యాద్రి ప్రసంగిస్తూ ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు చెప్పిన నానుడిని గుర్తు చేస్తూ ప్రతిఒక్కరూ వ్యాయామం, నడక, యోగ క్రమం తప్పకుండా చేసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. విశ్వోదయ రెక్టార్ డి.వినయకుమార్ రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ అవగాహనా కార్యక్రమానికి నర్సింగ్, జవహర్ భారతి డిగ్రీ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని కేన్సర్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించుకున్నారు.

పుల్లా శ్రీనివాసులురెడ్డి నియామకం



ప్రజాశక్తి-కావలి : కావలి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం అధ్యక్షుడుగా కావలి పట్టణ 34వ వార్డు ఇన్‌ఛార్జ్ పుల్లా శ్రీనివాసులురెడ్డిని నియమించినట్లు రాష్ట్ర పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటనలో పేర్కొంది. వైసిపి లో క్రమశిక్షణ కలిగిన కార్యాకర్తగా కావలి పట్టణ 34వ వార్డు ఇన్‌ఛార్జ్‌గా విశేష సేవలు అందించిన శ్రీనివాసులు రెడ్డిని పార్టీలో మరింత సేవలను ఉపయోగించుకొనేలా ప్రచార విభాగం అధ్యక్షుడుగా నియమించారు. అయితే ఈ సందర్భంగా పుల్లా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ వైసిపిలో చేరిన నాటి నుంచి తనను ఒక తమ్ముడుగా చేరదీసి ప్రేమ, అభిమానులు చూపిస్తున్న కావలి మాజీ ఎంఎల్ఎ, వైసిపి ఇన్‌ఛార్జ్ ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆశీస్సులతో తనకు ఈ పదవి రావటానికి కారణమని ఆయనకు ఉంటానన్నారు.

సర్వేను బాధ్యతగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-వరికుంటపాడు



మండలంలోని ప్రతి గ్రామంలో ఇంటి వద్ద సచివాలయ సిబ్బంది చేస్తున్న సర్వేను బాధ్యతగా పూర్తి చేయాలని ఉపగణాంక అధికారి కె.శ్రీనివాసరావు, సహాయక గణాంక అధికారి భక్తవత్సల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన వరికుంటపాడులో జరుగుతున్న సర్వేను తనిఖీ చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి యజమానితోపాటు సభ్యుల వివరాలు వారి పూర్తి సమాచారాన్ని సేకరించే సర్వేను సమర్థవంతంగా చేయాలని సచివాలయ సిబ్బందికి ఆయన సూచించారు. కార్యక్రమంలో ఈఓపిఆర్డి నాగూర్ వల్లి, వీఆర్వో కొండా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.